# ఇన్లాండ్ లెటర్ కథలు

## అనుమానం

మాధవి ఆఫీసుకు వెళ్ళడానికి తయారవుతోంది. ఈలోగా ఫోను మోగడంతో రామయ్య హడావుడిగా ఫోను ఎత్తాడు. అలాగే, అలాగే అంటూ సంతోషంగా ఫోను పెట్టేసి మధూ ఈరోజు ఆఫీసుకు శెలవు పెట్టు నిన్ను చూసుకునేందుకు కాకినాడ సంబంధం వాళ్ళు వస్తున్నారు అని చెప్పి లక్ష్మీ అంటూ కంగారుగా పిలుస్తూ, వంట ఇంట్లోకి వెళ్ళాడు. తీరికగా వంట పని చూస్తున్న లక్ష్మి భర్త చెప్పిన విషయం విని చాలా సంతోషించింది. వాళ్ళు రావడానికి రెండు గంటలు టైము వుంది. మీరు బజారుకు వెళ్ళి పువ్వులు, స్వీట్స్ తీసుకురండి, వాళ్ళు వచ్చిన వెంటనే రస్నా కలిపి ఇస్తాను అంది. పెళ్ళివారు రానే వచ్చారు. పెళ్ళి కొడుకు ప్రదీప్‌కు తొలి చూపులోనే ఎంతో నచ్చింది మాధవి. మా అమ్మాయి బి.కాం. చదివింది. టైపు పాసయింది. ఇంటి పని, వంట పని చక్కగా చేస్తుంది. ప్రస్తుతం ఖాళీగా వుండకుండా ప్రయివేటు కంపెనీలో టైపిస్టుగా పని చేస్తుంది అంటూ వివరంగా చెబుతున్నారు రామయ్య. ప్రదీప్ అందరి ఎదురుగానే మాధవి నచ్చిందని చెప్పగానే ఆలస్యం చెయ్యకుండా అన్ని ఖాయం చేసుకుని ముహూర్తం కూడా పెట్టేశారు. మాధవి మెళ్ళో మూడు ముళ్ళు పడ్డాయి. చక్కగా అలంకరించుకుని ఎన్నో ఊహలతో సంతోషంగా పాల గ్లాసుతో ఆ గదిలోకి అడుగు పెట్టింది మాధవి. సుగంధ పరిమళాలతో నిండిన ఆ గదిలో ఉన్న టీవి దగ్గర చేతిలో ఉన్న కాగితంతో దీర్ఘంగా ఆలోచిస్తున్నాడు ప్రదీప్. తన ఉనికి తెలియాలని చిన్నగా దగ్గింది మాధవి. ప్రదీప్ చేతిలో కాగితాన్ని విసురుగా మాధవి చేతిలో పెట్టి ఏమిటిది అన్నాడు. బెదిరిపోయిన కళ్ళతో ఆందోళనగా విప్పి చూసింది.

ప్రదీప్‌గారు,

మీరు పెళ్ళి చేసుకోబోయే అమ్మాయిది మంచి క్యారెక్టరు కాదు. అనేక మంది మగాళ్ళతో పరిచయాలున్నాయి. నాతో ప్రేమ నటించి మోసం చేసింది. మీరు మోసపోకూడదని వ్రాస్తున్నాను.

—ఆకాశరామన్న

బెదిరిన లేడిలా చూసింది మాధవి. నిజంగా నేను అలాంటి దాన్ని కాదు నమ్మండి. ఎవరో గిట్టని వాళ్ళు ఇది వ్రాశారు. హఠాత్తుగా మాధవి ఆలోచనలు ఆఫీసు పైకి మళ్ళాయి. ఆఫీసులో తనతో పాటు పని చేసే రాకేష్ తన వెంట పడటం, తను అది తప్పని బుద్ధి చెప్పడం అతను నా సంగతి, నీకు తెలీదు, నీకు పెళ్ళి కాకుండా చేస్తానని బెదిరించడం గుర్తు వచ్చి ఇది ఖచ్చితంగా అతని పనే, వ్రాత కూడా అతనిదే అంటూ తను ఆఫీసులో చేరిన దగ్గర నుంచి అన్ని విషయాలు వివరంగా చెప్పింది మాధవి ప్రదీప్‌కు. మీరు నమ్మినా నమ్మకపోయినా ఇది మాత్రం నిజం అంటూ నీళ్ళు నిండిన కళ్ళతో బేలగా చూసింది మాధవి. అప్పటి వరకు కోపం నటిస్తున్న ప్రదీప్ ఇంక నటించ లేకపోయాడు. చిన్నగ మాధవి కన్నీరు తుడిచి దగ్గరకు తీసుకున్నాడు. నాకు ఈ ఉత్తరం చూసిన వెంటనే పిచ్చెత్తినట్టు అనిపించింది. అందులో విషయం నిజం అనిపించలేదు. నమ్మబుద్ధి కాలేదు. ఇంకా ఏం చెయ్యాలో తోచక ఆఫీసుకు శెలవు పెట్టి మీ ఆఫీసుకు వచ్చి మీ మేనేజరును కలిశాను. నీ గురించి అడిగాను. ఆయన నీ గురించి ఎంతో గర్వంగా మంచి వర్కర్‌వని, మంచి అమ్మాయివని, సిన్సియర్‌గా ఆఫీసుకు టైముకు వచ్చేది నువ్వు ఒక్క దానివే నని చెప్పారు. నేను ఉత్తరం చూపించి దీని విషయం ఏమిటని అడిగాను. ఆ లెటర్ చదివి ఆయన నవ్వేశారు. మిస్టర్ ప్రదీప్ గిట్టని వాళ్ళు ఏదో ఒక విధంగా నింద వెయ్యాలని ఇటువంటి ఉత్తరాలు వ్రాస్తారు. మన నమ్మకం మనకుండాలి. ఈ ఉత్తరం మా ఆఫీసులో పని చేసే రాకేశ్ వ్రాసిందే. అతను శుద్ధ వరస్ట్ ఫెలో అని అందరికీ తెలుసు. ఇంతకి మీరెవరు యిన్ని వివరాలు సేకరిస్తున్నారని అడిగారు. నేను నీ కాబోయే భర్తనని ఈ ఉత్తరం చదివి ఏం చెయ్యాలో తోచక మీ దగ్గరకు వచ్చానని, కాబోయే భార్య గురించి అన్ని వివరాలు సేకరించినందుకు ఏమీ అనుకోవద్దని సారీ అని చెప్పాను. ఆయన మీరు చాలా లక్కీ అని నన్ను బాగా అభినందించారు. మాధవి లాంటి మంచి స్త్రీ మీకు భార్య కావడం మీ అదృష్టం అని అన్నారు. నేను సంతోషంతో తేలికైన మనస్సుతో తిరిగి వచ్చాను. ఊరికే నిన్ను భయపెట్టాలని కోపం నటించాను. నువ్వు నన్ను మనస్ఫూర్తిగా క్షమించాలి. పెళ్ళి కాకుండానే నీ గురించి అన్ని వివరాలు సేకరించినందుకు అని అంటున్న ప్రదీప్ నోరు చేత్తో మూసి అంత మాట అనకండి. మీ స్థానంలో ఎవరున్నా అదే పని చేస్తారు, అంటున్న మాధవి కళ్ళలో తన అందమైన భావి జీవితాన్ని చూస్తు వుండిపోయాడు ప్రదీప్.

— సి.సావిత్రిగిరి
హుబ్లీ, కర్ణాటక

## క్యాలెండర్ బొమ్మ

సల్లక్షణమైన భార్య వున్నా వెరైటి కోసం వెంపర్లాడటం కొంత మంది రివాజు. శేఖర్ కూడా అదే బాపతు. పండక్కి పుట్టింటికెళ్తూ రమ్మనమని బ్రతిమాలిన భార్యకు ఏదో నచ్చచెప్పి బస్సెక్కించాడు.

ఇప్పుడెక్కడ వూరేగినా అడిగే వారు లేరు, ఇష్టా రాజ్యం.

టైమ్ చూశాడు. రాత్రి తొమ్మిదయింది. హోటల్లో ఏదో కాస్త తిని, టిప్‌టాప్‌గా తయారయ్యి చీకటి సందులోకి జొరబడ్డాడు. ఎటు చూసినా డిమ్‌లైట్లు నింగిలోని చుక్కల్లా మిణుకు మిణుకుమంటున్నాయి. అతనికిదేం కొత్తగాదు. అయినా ఏదో తెలియని సరికొత్త భావన గిలిగింతలు పెడుతుంది. ఒక నెల జీతమంతా ఫణంగా పెట్టి ఫిక్స్ చేసుకున్న గదిలోకి అడుగుపెడుతూనే, డబల్‌కాట్ మీది దృశ్యం చూసి విస్మయచకితుడయ్యాడు. ఆర్టిఫీషియల్‌గా మెరిసే అందం అద్భుతంగానే వుంటుంది మరి. ఆ అందం ముందు తను చెల్లించిన మూల్యం ఎంతని అనుకున్నాడు. అది ప్లాస్టిక్ పువ్వని అందులో మకరందానికి బదులు చేదు అనుభవాలను చవి చూడాల్సి వస్తుందని తెలిసి కూడా దానిపై వాలటానికి ప్రయత్నించింది తేనెటీగ. కాని అంతలోనే ఎవరో చెంప మీద ఈడ్చి కొట్టినట్టు అనిపించి తలెత్తి చూశాడు. ఎదురుగా కృశించి చివరి దశలో వున్న ఎయిడ్స్ రోగి బొమ్మ క్యాలెండర్ మీద దర్శనమిచ్చింది. క్రింద వ్రాసి ఉన్న స్లోగన్ కళ్ళతోనే చదివాడు.

"వేశ్యా వాటికలకు దూరంగా వుండండి. లేకుంటే మీకు ఇదే గతి పడుతుంది". శేఖర్‌కు ముచ్చెమటలు పోశాయి. భయంతో నిలువునా వణికి పోయాడు. మూడ్ మారిపోయింది.

'వెధవ డబ్బు పోతే పోయింది. బ్రతికుంటే బండరాళ్ళు కొట్టుకుని అయినా బతకొచ్చు' అని అనుకుంటూ షర్టు తగిలించుకుని వెనక్కి తిరిగి చూడకుండా వెళ్ళిపోయాడు.

అతను వెళ్ళగానే క్యాలెండరు చుట్టేసి రహస్యంగా దాచేసింది ఆ జవ్వని.

"ఈవిధంగా నయినా వచ్చిన విటులకు కనువిప్పు కలిగితే నా పాపానికి కొంతవరకయినా నిష్కృతి వుంటుంది. జీవితంలో ఒక్క మంచి పనయినా చేశానన్న తృప్తితో హాయిగా కళ్ళు మూస్తాను" అని మనస్సులోనే అనుకుంది. ఆ మృత్యు పంజరంలో నుంచి బయట పడలేక విలవిల్లాడుతున్న ఆ వన జవ్వని.

ఎవరి సంగతెలా వున్నా శేఖర్‌కు మాత్రం మంచి గుణపాఠమే కలిగింది.. ఇది జరిగి చాన్నాళ్ళయినా ఇప్పటికీ దడిపిస్తూనే వుంది ఆ క్యాలెండర్ బొమ్మ.

—జి.విజయలక్ష్మి
నాగార్జున సాగర్,